నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I | హైదరాబాద్, శనివారం 22 ఫిబ్రవరి 2025 | RANGAREDDY




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## ఎల్లమ్మ తల్లీ..
# సీఎం బుద్ధి మార్చు..

- ప్రజా సంక్షేమానికి పాటుపడే మనసు ఇవ్వు..
- ఆలయ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేయాలి

**మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి**

కొడంగల్, ఫిబ్రవరి 21 : పోలేపల్లి ఎల్లమ్మ తల్లీ.. సీఎం రేవంత్‌రెడ్డి బుద్ధి మార్చి ప్రజా సంక్షేమానికి పాటుపడే మనసు ప్రసాదించాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కోరుకున్నారు. శుక్రవారం ఆయన దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రైతులు, ప్రజలపై కరుణను చూపాలని.. సమృద్ధిగా వర్షాలు కురిసి ఆశించిన మేర పంటలు పండి అందరూ సంతోషంగా ఉండాలని, అదేవిధంగా సీఎం బుద్ధిని మార్చి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా మంచి మనసు ఇవ్వాలని ఆ తల్లిని కోరుకున్నట్లు ఆయన చెప్పారు. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ఏ ఒక్క హామీనీ సక్రమంగా అమలు చేయడం లేదని మండిపడ్డారు. రైతుభరోసా అందక, రైతుబీమా అమలు కాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అరకొరగా రైతు రుణాలను మాఫీ చేయడంతో వేలాది మంది అన్నదాతలకు అప్పుల నుంచి విముక్తి లభించలేదన్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని.. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని అన్ని వర్గాల వారు కోరుకుంటున్నారన్నారు. ఆలయాన్ని దర్శించుకున్న సీఎం ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ. 25 కోట్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చాంద్‌పాషా, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, కోట్ల యాదగిరి, భీములు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో
# అర్చకులకు అవమానం

- హైదరాబాద్ నుంచి వచ్చిన పురోహితులతో ఆలయంలో పూజలు చేయించిన సీఎం
- ఖండించిన రాష్ట్ర అర్చక పురోహిత సంక్షేమ సంఘం సభ్యుడు రాజశేఖర్

కులకచర్ల, ఫిబ్రవరి 21 : సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక పూజారులను అవమానించారని రాష్ట్ర అర్చక పురోహిత సంక్షేమ సంఘం సభ్యుడు మఠం రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పోలేపల్లి ఎల్లమ్మ తల్లి జాతర ఉత్సవాలకు హాజరైన ముఖ్యమంత్రి ఆలయంలో స్థానిక పూజారులను పూజ చేసేందుకు అనుమతించలేదన్నారు. హైదరాబాద్ నుంచి పురోహితులను తీసుకొచ్చి వారితో పూజలు చేయించి ఇక్కడి అర్చకులను అవమానించారన్నారు. అక్కడ నిత్యం పూజాకార్యక్రమాలు నిర్వహించే అర్చకులను అవమానించడాన్ని రాష్ట్ర అర్చక సమాఖ్య ఖండిస్తుందన్నారు.

## కొడంగల్‌కు ఇచ్చి..
# మాకెందుకు ఇవ్వరు..?

- కేవలం కొడంగల్ సెగ్మెంట్‌లో 'మన ఊరు-మన బడి' కింద చేపట్టిన పనులకు మాత్రమే నిధులు విడుదల
- పరిగి, తాండూరు, వికారాబాద్ సెగ్మెంట్లకు మొండి చెయ్యి
- పెండింగ్ బిల్లుల కోసం 14 నెలలకుపైగా నిరీక్షిస్తున్న కాంట్రాక్టర్లు
- రావాల్సిన బిల్లులు రూ.10 కోట్లు..
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- బిల్లులు చెల్లించాలని ప్రజావాణిలో వినతులు

**మన ఊరు-మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు బిల్లులు రాక పోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రేవంత్ సర్కార్ కేవలం కొడంగల్ సెగ్మెంట్ పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి.. జిల్లాలోని మిగిలిన సెగ్మెంట్లైన పరిగి, వికారాబాద్, తాండూరు పరిధిల్లోని కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొడంగల్‌కు ఇచ్చి.. మాకేందుకు ఇవ్వరని.. తమపై శీతకన్ను తగదని వారు పేర్కొంటున్నారు.**



బిల్లులు త్వరగా చెల్లించాలని కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించిన కాంట్రాక్టర్లు (ఫైల్)

వికారాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పూర్తైన పనులకు సం బం ధించి చెల్లింపులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తైనా కాంట్రాక్టర్లకు సంబంధిత డబ్బులను విడుదల చేయకపోవడం గమనార్హం. గతేడాదిగా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రాలు అం దిస్తున్నా ఇప్పటికీ నిధులకు మోక్షం లభించలేదు. అయితే, రేవంత్ సర్కార్ కేవలం కొడంగల్ సెగ్మెంట్‌పైనే దృష్టి సారించి రూ. వేల కోట్ల నిధులను విడుదల చేస్తూ .. వికారాబాద్, పరిగి, తాం డూరు సెగ్మెంట్లపై శీతకన్ను చూపుతున్నది. రెండు నెలల కిందట కొడంగల్ నియోజకవర్గంలో 'మన ఊరు-మన బడి'లో భాగంగా పూర్తైన పనులకు బిల్లులను విడుదల చేసిన ప్రభుత్వం వారికే అమ్మ ఆదర్శ పాఠశాల పనుల కాంట్రాక్ట్‌నూ అప్పగించింది. మరోవైపు వికారాబాద్, తాండూరు, పరిగి సెగ్మెంట్లలో 'మన ఊరు-మన బడి' పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు.. భార్యల పుస్తెల తాడులు విక్రయించి.. ఇతరుల వద్ద అప్పులు తీసుకొచ్చి బడుల్లో మౌలిక వసతులను కల్పించామని.. తమ పెం డింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

'మన ఊరు-మన బడి'లో భాగంగా బడుల్లో మౌలిక వసతుల కల్పన పనులు పూర్తికాగా.. బిల్లుల కోసం కాంట్రాక్టర్లు గతేడాదిగా ఎదురుచూస్తున్నారు. స్కూల్ కమిటీలు, సంబంధిత అధికారుల ఒత్తిడితో పలు స్కూళ్లలో పనులను పూర్తి చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లు నిధులు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు.. కలెక్టర్, ప్రజాభవన్, సచివాలయంలోని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికీ తీసుకెళ్లినా ప్రభుత్వం నిధుల విడుదలలో నిర్లక్ష్యం చేస్తున్నది. ప్రతివారం కాంట్రాక్టర్లు ప్రజావాణిలో బిల్లులను విడుదల చేయాలంటూ విజ్ఞప్తి చేస్తున్నా.. త్వరలోనే వస్తాయంటూ అధికారులు దాట వేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడుల్లో సొంత నిధులు, అప్పులు తీసుకొచ్చి మౌలిక వసతులను కల్పించామని.. ఏడాది దాటినా బిల్లులు రాకపోవడంతో అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని, బతకడం కష్టంగా మారిందని పలువురు కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. కాగా, జిల్లాలో 'మన ఊరు-మన బడి'లో భాగంగా మొదటి విడతలో 371 బడులను ఎంపిక చేయగా, 20 స్కూళ్లలో పనులు పూర్తి కాగా గత ప్రభుత్వంలోనే ప్రారంభించారు. కాగా సుమారు 300 స్కూళ్లలో పనులు 20-50 శాతం మేర పూర్తయ్యాయి. సంబంధిత పనులకు సంబంధించి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నది.

### పెండింగ్‌లోనే రూ. 10 కోట్ల బిల్లులు

### 20 బడుల్లో మారిన రూపురేఖలు

జిల్లాలో 20 స్కూళ్లలో అవసరమైన మౌలిక వసతులను కల్పించారు. 'మన ఊరు-మన బడి'లో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, విద్యుత్తు, గ్రీన్ చాక్‌బోర్డులు, పెయింటిం గ్, ప్రహరీలు, కిచెన్ షెడ్లు, శిథిలమైన తరగతి గదుల స్థానంలో కొత్తవి నిర్మాణం, మరమ్మతులు, డిజిటల్ విద్యకు అవసరమైన ఏర్పాట్లు, ఉన్న త పాఠశాలల్లో డైనింగ్ హాళ్లను ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలో 1054 ప్రభుత్వ పాఠశాలలుండగా వాటిలో మొదటి విడతలో 371 స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు ఎంపిక చేశారు. మొదటి విడతలో ఎంపిక చేసిన స్కూళ్లలో ఉన్నత పాఠశాలలు-111, ప్రాథమికోన్నత పాఠశాలలు-40, ప్రాథమిక పాఠశాలలు-220 పాఠశాలలున్నాయి. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 'మన ఊరు-మన బడి' స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. అయితే ఇందులో గతంలో 'మన ఊరు-మన బడి'లో పనులు పూర్తి కాని పాఠశాలలను ఎంపిక చేసి పనులను చేపట్టారు.

### ప్రతినెలా రూ.50 వేల మిత్తి



పూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో రూ. 25 లక్షలు అప్పులు తీసుకొచ్చి పనులు పూర్తి చేశా. గత 14 నెలలుగా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా. తెచ్చిన అప్పుల కు ప్రతినెలా వడ్డే రూ.50,000 అవుతున్నది. అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు నెల రోజుల్లో బిల్లులు విడుదల చేసిన ప్రభుత్వం మాకు చెల్లించకపోవడం దారుణం.

**- జంగయ్య, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్, పూడూరు**

### నిధుల విడుదలలో వివక్ష తగదు



ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో ముగ్గురం కలిసి రూ.40 లక్షలతో మౌలిక వసతులను కల్పించాం. వాటి బిల్లుల కోసం ఏడాదికిపైగా డీఈవో కార్యాలయం మొదలుకొని కలెక్టరేట్, సచివాలయం వరకు ప్రదక్షిణలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బిల్లులను విడుదల చేయడం లేదు. ఎంబీలు పూర్తైనా బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. కేవలం కొడంగల్ నియోజకవర్గంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే నిధులు విడుదల చేసి తమపై వివక్ష చూపడం తగదు. మేం అప్పులు చేసి మరీ పనులు చేపట్టాం. ఇప్పుడు వడ్డీలు చెల్లించలేకపోతున్నాం.

**-అరవింద్, కాంట్రాక్టర్, ముజాహిద్‌పూర్, కులకచర్ల మండలం**

# సైన్యం కోసమే డబ్బు వసూలు

- పోలీసుల విచారణలో వెల్లడి
- చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి నేపథ్యంలో వీరరాఘవరెడ్డి కస్టడీ పూర్తి
- అనంతరం కోర్టులో హాజరు పర్చిన పోలీసులు

మొయినాబాద్, ఫిబ్రవరి 21 : చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు, రామరాజ్యం వ్యవస్థాపకుడు వీరరాఘవరెడ్డి పలు ఆలయాల్లో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కోర్టు అనుమతితో నిందితుడిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు మూడు రోజుల పాటు విచారించి నివేదికను కోర్టుకు సమర్పించారు. విచారణ అనంతరం శుక్రవారం రాజేంద్రనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపర్చారు. దేశంలో ఉన్న ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం లేకపోవడంతో అతడు సొంతంగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచనతో 2022లో రామరాజ్యం పేరుతో సంస్థను ఏర్పాటు చేసిన వీరరాఘవరెడ్డి అప్పటి నుంచి పలు ప్రాంతాల్లోని హిందూ దేవాలయాలకు వెళ్లి అర్చకులతో మాట్లాడుతూ.. రామరాజ్యం స్థాపన ఉద్దేశాలను వివరిస్తూ వారి మద్దతూ తీసుకుంటున్నాడు. రామరాజ్య స్థాపనకు తమకు సహకరించాలని కోరుతూ.. వారి నుంచి డబ్బులు వసూలు చేశారని పోలీసుల విచారణలో వెల్లడైంది.

హిందూ ధర్మాన్ని కాపాడేందుకు రామరాజ్యం సైన్యంలో ఆసక్తి ఉన్న వారు చేరాలని ప్రతినెలా రూ. 20 వేల వేతనం ఇస్తామని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో గత నెల 25 మంది రామరాజ్యం సైన్యంలో చేరారు. అనంతరం వారు హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ నుంచి నేరుగా చిలుకూరు బాలాజీ ఆలయానికెళ్లి అర్చకుడు రంగరాజన్‌ను రామరాజ్యం సైన్యానికి కొంత మంది సైనికులను పంపాలని, సైనికులను పంపిన తర్వాత వారికి నిధులను సమకూర్చాలని డిమాండ్ చేశాడు. వీరరాఘవరెడ్డి డిమాండ్‌కు అంగీకరించకపోవడంతో ఆయనపై దాడి చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు.

వీటితోపాటు పలు కీలక విషయాలను కూడా పోలీసులు కోర్టుకు సమర్పించిన నివేదికలో పొందుపర్చినట్లు సమాచారం. వీరరాఘవరెడ్డికి డబ్బులు ఇచ్చిన వారు నగదు రూపంలో ఇచ్చారా..? బ్యాంకు ఖాతాలో జమ చేశారా..? అనే విషయాలపై పోలీసులు దృష్టి సారించారు. నిందితుడి ఖాతాలోకి ఎవరెవరి ఖాతాల నుంచి డబ్బులు వచ్చాయనే అంశాలపై ఆరా తీశారు. ఆయనతో ఫోన్‌లో ఎవరెవరు మాట్లాడారు? తదితర విషయాలను సైతం సేకరించి నివేదికలో పొందు పర్చినట్లు తెలిసింది. వీర రాఘవరెడ్డిని కో ర్టులో జడ్జి ముందు హాజరు పర్చి అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు.

# తెలంగాణలో అమెరికన్ ఫుట్‌బాల్ అకాడమీలు

అమీర్‌పేట, ఫిబ్రవరి 21 : అమెరికన్ ఫుట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ అకాడమీల ఏర్పాటుకు కృషి జరుగుతున్నదని తెలంగాణ అమెరికన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (టాఫా) నూతన అధ్యక్షుడు బల్విందర్‌నాథ్ పేర్కొన్నారు. తెలంగాణలో అమెరికన్ ఫుట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్‌లను ప్రోత్సహించాలన్న టాఫా లక్ష్యంలో భాగంగా రాష్ట్ర నలుమూలలా ఈ క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. (2025-28) కాలానికి టాఫా నూతన అధ్యక్షుడిగా ఎంపికై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం బేగంపేటలోని హోటల్ హరిత ప్లాజాలో జరిగిన సమావేశంలో రానున్న రోజుల్లో టాఫా చేపట్టనున్న కార్యక్రమాలను సంస్థ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, భారత జట్టు కెప్టెన్ (అమెరికన్ ఫుట్‌బాల్) మణికంఠరెడ్డి, ఏఎఫ్ఎఫ్ఐ సీఈవో సందీప్‌చౌదరి ఎల్లాతో కలిసి వెల్లడించారు. ఈ సందర్భంగా బల్వీందర్‌నాథ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అమెరికన్ ఫుట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ అకాడమీల ఏర్పాటుకు సంస్థ సిద్ధంగా ఉందని.. ఔత్సాహిక క్రీడాకారులను ఎంపిక చేసి తగిన శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా స్థాయిలో టాఫా అసోసియేషన్లను ఏర్పాటు చేస్తూ, రానున్న రోజుల్లో గచ్చిబౌలిలో అమెరికన్ ఫుట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్‌కు సంబంధించి అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు.

## తెలంగాణలో 10 ఎస్బీఐ శాఖల ప్రారంభం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) తెలంగాణలో నూతనంగా 10 శాఖలను ప్రారంభించింది. ఎస్బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి, చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం వాటిని ప్రారంభించారు. అలంపూర్ ఎక్స్ రోడ్డు, చినంబావి, రాఘవేంద్ర కాలనీ, నియోపోలీస్, కిష్టారెడ్డిపేట, ఖాజాగూడ, ఉస్మాన్‌నగర్, కంగ్టి, సుచిత్ర, నందిపేట ప్రాంతాల్లో నూతన బ్రాంచులను ప్రారంభించారు. ఇందులో ఐదు అర్బన్, ఐదు రూరల్ ప్రాంతాల్లో ఉండడం గమనార్హం.



# డబుల్ బెడ్‌రూమ్ రాదు.. ఇందిరమ్మ ఇల్లు లేదు

- స్థలం కొంతమందికే ఉందన్న సాకుతో నగరాన్ని పక్కకు పెట్టిన సర్కార్
- కట్టించి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలంటున్న ప్రజలు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): ఇంటి స్థలం కొంతమందికే ఉందన్న సాకుతో తొలి విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో హైదరాబాద్‌ను కాంగ్రెస్ సర్కార్ పక్కకుపెట్టింది. కేసీఆర్ ప్రభుత్వం కట్టించిన లక్ష డబుల్ బెడ్ ఇండ్లలో ప్రజలకు పంపిణీ చేయగా ఇంకా దాదాపు 32 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నగరం నలుమూలలా ఉన్నాయి. వాటిని తమకు పంపిణీ చేయాలని పేద ప్రజలు కోరుతున్నారు. వాటిని పంచితే క్రెడిట్ అంతా కేసీఆర్‌కే వస్తుందనే అక్కసుతో నిరుపయోగంగా ఉంచుతూ నిరుపేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆవేదన చెంతున్నారు. నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సిద్ధంగా ఉండగా.. ఎందుకు పంచడం లేదని నిలదీస్తున్నారు.

### ఖరీదైన ప్రాంతాల్లో ..

కేసీఆర్ ప్రభుత్వంలో పేద ప్రజలు ధీమాగా బతకాలనే దృఢ సంకల్పంతో వందలాది కోట్ల రూపాయల విలువైన ప్రాంతాల్లో సకల సదుపాయాలతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించారు. హైదరాబాద్ విశ్వ నగరంగా విస్తరిస్తుండటంతో శివారు ప్రాంతాల్లోని భూముల ధరలు కోట్లలోకి చేరాయి. ఆ ప్రాంతాల్లోనే నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని కేసీఆర్ సర్కార్ భావించింది. అందుకనుగుణంగా నగరం నలుమూలలా లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించారు. వాటిలో దాదాపు 68 వేల ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇంకా సుమారు 32 వేల ఇండ్లు పంపిణీకి సిద్ధంగా ఉంచారు. కానీ వాటిని కాంగ్రెస్ సర్కార్ నిరుపయోగంగా ఉంచుతోంది. ఇందిరమ్మ ఇండ్ల పేరిట కొత్త పథకాన్ని తీసుకొచ్చి.. కోట్ల విలువైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పక్కకు పెట్టిందని నిరుపేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నిరుపేదలకు సొంత స్థలం ఎలా సాధ్యం?

శంకుస్థాపనలతో కాలయాపన చేసే బదులు సిద్ధంగా ఉన్న ఇండ్లను పంచితే నిరుపేదలకు ఉపయోగంగా ఉంటుందని అంటున్నారు. నగరంలో నివసించే పేదలకు సొంత స్థలం ఉండదనే అప్పటి కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించింది. కానీ కాంగ్రెస్ సర్కార్ మాత్రం సొంత స్థలం ఉంటేనే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెబుతున్నది. సొంత స్థలం ఉంటే పేదలమెలా అవుతామని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇండ్ల పేరిట మోసం చేయకుండా సిద్ధంగా ఉన్న ఇండ్లను పంచాలని కోరుతున్నారు. నగర ప్రజలను దరఖాస్తుల పేరిట ఇబ్బందులకు గురిచేయకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ముందుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఇప్పటికే ఎంపికైన వారికి పంపిణీ చేసి.. మిగిలిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని అభిప్రాయపడుతున్నారు.

# పన్ను కట్టలేదో.. సీజ్ చేస్తాం

- 6 లక్షల మందికి బల్దియా నోటీసులు..
- ఆస్తిపన్ను బకాయిదారులను టార్గెట్ చేసిన జీహెచ్ఎంసీ
- ఒక్కో సర్కిల్‌లో రోజుకు 5 ఆస్తులు సీజ్
- ప్రాపర్టీల సీజ్ పేరిట భయబ్రాంతులకు గురి చేస్తున్న అధికారులు



యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఆస్తిపన్ను బకాయి ఉన్న ఒక ప్రైవేట్ స్కూల్‌ను సీజ్ చేసిన బల్దియా అధికారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : ఆస్తి పన్ను కట్టని వారిని జీహెచ్ఎంసీ లక్ష్యంగా చేసుకున్నది. పన్ను కట్టని వారి ఆస్తులను సీజ్ చేస్తామంటూ బెదిరిస్తున్నది. ఇందులో భాగంగానే ప్రతిరోజూ ఒక్కో సర్కిల్‌లో ఐదేసి చొప్పున ఆస్తులను సీజ్ చేస్తున్నది. వచ్చే నెలాఖరులో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దరిమిలా జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లపై దూకుడు పెంచింది. చిన్నా, చితకా బకాయిదారుల నుంచి బడా వ్యక్తుల వరకు బకాయిదారుల చిట్టాను రూపొందించింది. సంస్థ ఖజానాను నింపుకోవడమే ఏకైక ఎజెండాగా ఆయా సర్కిళ్ల పరిధిలో బకాయిదారుల జాబితాపై కార్యాచరణను ప్రకటించింది.

### రెడ్ నోటీసులు జారీ

గత మూడు సంవత్సరాల పైబడి బకాయిలు పెండింగ్‌లో ఉండి పన్ను చెల్లించని వాళ్లకి వారెంట్స్ ఇష్యూ చేస్తున్నారు. ఇందులో భాగంగానే 6 లక్షల మంది బకాయిదారులకి రెడ్ నోటీసులు జారీ చేశారు. వీరి నుంచి రూ.400కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించాలని వారికి నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించిన వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ 269(2) కింద ఆస్తులను సీజ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి వరకు 80 ఆస్తులను సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం బంజారాహిల్స్‌లోని తాజ్‌బంజారా భవనాన్ని సీజ్ చేయగా.. సదరు యాజమాని స్పందించి శుక్రవారం ఆర్‌టీజీఎస్ ద్వారా జీహెచ్ఎంసీకి రూ. 51 లక్షల 50వేలను చెల్లించారు. మిగిలిన ప్రాపర్టీ ట్యాక్స్‌ను మార్చి 10వ తేదీలోపు చెల్లిస్తామని పేర్కొన్నారు.

### రూ. 520 కోట్లే లక్ష్యం

ఆస్తిపన్ను బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. 30 సర్కిళ్లలో బకాయిదారులను చిట్టాను సిద్ధంచేసి వారికి రెడ్ నోటీసులు జారీ చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. రోజురోజుకూ సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుండడం, ఈ ఆర్థిక సంవత్సరం రూ.2000కోట్ల నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు కేవలం రూ. 1480 కోట్ల మేర పన్నులు రావడంతో బకాయిదారులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. 19.25 లక్షల మందిలో 12 లక్షల మంది మాత్రమే ఆస్తిపన్ను చెల్లించారని, దాదాపు 6.75 లక్షల మందిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి రూ.520 కోట్లు రాబట్టాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సూపర్‌వైజరీ ఆఫీసర్లు రోజు వారీగా వసూలైన ఓటీఎస్ కలెక్షన్లను పీటీఐఎన్ నంబరు, వచ్చిన కలెక్షన్ల వివరాలను ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోనున్నారు. ఆస్తిపన్ను చెల్లించాలని బకాయిదారులకు ఎస్ఎంఎస్‌లు పంపించనున్నారు.

### వారి విషయంలో మొక్కుబడిగా..

జీహెచ్ఎంసీకి ఆస్తిపన్ను రూపంలో మొండి బకాయిలు మొత్తం దాదాపుగా రూ. 9800 కోట్ల మేర రావాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలదే. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన 600 ఆస్తుల నుంచి రూ. 500 కోట్ల మేర, ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు 4,000 ప్రాపర్టీల నుంచి రూ. 5000కోట్ల బకాయిలు జీహెచ్ఎంసీ ఖజానాను చేరాల్సి ఉన్నది. అయితే సాధారణ నగరవాసుల విషయంలో ప్రాపర్టీల సీజ్ వరకు వెళ్తున్న అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల విషయంలో మాత్రం నోటీసులతోనే సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి.